అశోక కథ

పి. రామలక్ష్మి

సీత రామునికోసం ఎదురుచూస్తూ కూచున్నది. శోభాయమానమైన పట్టు పరుపులు వేయబడిన రత్నకాంతులీనే కురిచీలలో కూచుందా సీత?— వాటి ఆకర్షణకీ సుఖానికీ ఎంతమాత్రం లొంగిపోని సీత ఎక్కడ కూచుందని? ఒక సామాన్యమైన ఒక చందనపు చెక్కతో తయారైన కిటికీలో కూర్చుని బయటికి చూస్తూంది.

ఒక విధంగా సీతకి అందులో కూచునే హక్కులేదు. పరిచారికలు ఆకస్మాత్తుగా ప్రవేశిస్తే ఇటువంటిచోట రాణులు కూచున్నట్టు గమనిస్తే హేళనగా చూస్తారు. అలా చులకనగా చూడబడటం ఏ అంతఃపుర కాంతారత్నానికీ యిష్టం కాదు. అందుకే వాళ్ళు పొరపాటునైనా అలాటి పని చేయరు.

ఈ సీతాదేవి హృదయగత భావాలు తెలిసిన శ్రీరామచంద్రుడు సీతకు తగిన స్వేచ్ఛ యిచ్చేడు. వనవాసానంతరం పట్టాభిషిక్తుడైన రాముణ్ణి ఒక్క కోరిక కోరుకుంది సీత భార్యగా. తనకు ప్రకృతి సౌందర్యాపేక్ష తగ్గిపోలేదు సరికదా ఇంకా ఏదో వనవాస రక్తి మిగిలివుంది. ఈ రత్నవైఢూర్య తాపితమైన భవనాల కాంతులలో వెలుగునామె ఒక్కొక్కప్పుడు భరించలేకపోతుంది. రామచంద్రుడు సీత పెదవులనుంచి కోరిక బయట పడకుండానే ఆ కనులలోనే చదివేశాడేమో అన్నట్టు, సీత నివసించే అంతఃపుర భవనాని కావల కిటికీల కెదురుగా అందమైనపూదోట వెలిసింది. ఆ వనంలో ఆడంబరమైన చిత్ర గృహాలు, కల్పిత లతా గృహాలు లేవు; వెండి అరుగులు, బంగారు పూతల ఆసనాలు లేవు. సహజ ఫల పుష్పాలతోను, శుక పికాదుల కలస్వనాలతోను, కలకలలాడే వనలక్ష్మి సౌందర్యాన్ని ఎన్నిసార్లు చూసినా తనివి తీరదు సీతకు. అందుకే భర్త రాకకు ఎదురు చూస్తూ, సృష్టి సౌభాగ్యాన్ని పరికిస్తూ

ఎనలేని ఆనందాన్ని అనుభవిస్తూంది.

కౌసల్యాదేవి అంతఃపురం నుంచి నేరుగా సీతకోసం ఆత్రుతగా వచ్చిన రాముడు — గుమ్మంలో అడుగు పెడ్తూనే సీత అన్యమనస్కంగా కూర్చున్న తీరు ఆమె నిరాడంబర కోమల హృదయ సౌజన్యాన్ని తనివితీరా చూసి, అంతలో కదిలి, సీతను సమీపించేడు.

రామచంద్రుని చేతి స్పర్శకు పులకించి వాలుగా అటుని వంక చూచింది సీత.

"స్వామీ! ఇంత ఆలస్యం చేశారు. అత్తగారు కులాసాగా వున్నారా? మీరు సభకు వెళ్లేవేళ అయినట్టుంది ప్రభూ!" అంది లేచి రాముని కభిముఖంగా నిలబడుతూ.

అతడు కిటికీలో నుండి సూర్యకిరణాలు చూచి "ఇంకా ఒక గంట ఇక్కడే వుండవచ్చు సీతా! నీలో తియ్యని కబుర్లు నాలుగు చెప్పందే, సభలో నేను రాజకీయాలు వర్తించలేను ప్రియా!" ప్రేమదృక్కులు సీత పైకి ప్రసరింపచేశాడు.

'ప్రియా' అని రాముడు పిలవగానే సీత సునుబొమ్మలు విరుపెక్కాయి. "ఏమిటో ఈరోజు మీ ధోరణి కొత్తగా వుంది" అంది సీత తల వంచుకొని.

"నిజమే—సభలో ఎవరన్న ఖరీదైన కిరీటాలూ, వజ్ర వైఢూర్యపు సింహాసనాలు, వచ్చల తివాసీలు, వాటి మిరిమిట్లు చూసి చూసి విసిగిన నా కళ్లకు నీ శాంతస్వరూపం, ఆడంబరాల్లేని అలంకరణ మనసుకు ఎంతగానో హత్తుకుపోయి నన్ను నేనె మరిచిపోతుంటాను సీతా! అంతఃపురంలోని ఆడవాళ్ళు మాత్రం ఏమైనా తక్కువా? అన్ని ఆభరణాలు మోస్తూ తిరిగే ఆడవారిపై నాలాటి వారికి కాటపోటె మనసెరికి జారి?—" చిరునవ్వుతో అంటున్నపతిని చూసి.

"అయితే దేవరవారి మెడలో ఈ వచ్చల హారం ప్రపదిసం వుండది దేనికో?" అంటి కొంటెతనంగా.

తనసీలపు శరీరంలో ఇంచుమించు కలిసిపోతూన్న వచ్చలు ముదిగిన బంగారు హారాన్ని చూచుకొని ఒక్క క్షణం తెల్లబోయాడు రాముడు. "పురుషులు ఈ హారాలు మొదలైనవి వేసుకొని, కిరీటాల బరువు మోయనక్కరలేని రోజు లెప్పుడొస్తాయో మరి?—" అన్నాడు.

"అదేమిటి - అలాటి రోజులొస్తాయా?"

"పిచ్చిదానా! ఇంత అమాయకురాలివి; నీవు లక్ష్మివని నమ్మలేకపోతున్నాను. కాని స్వతంత్ర భావ వాహినివిగా స్త్రీ లోకానికి ఆదర్శప్రాయమైనావులే."

సీత నవ్వింది. "లక్ష్మినో, మాయనో?— మీరు గుర్తు చేసేవరకు అమాయకురాలిగానే వుండపోతున్నాను. అదిసరే—అసలు విషయం మీ నోట చెప్పలేరాలి!" అన్నది రాముని వేళ్లను తన చేతులతో పెనవేస్తూ.

"ఏది? ఈ హారం విషయమా? చెబుతాను. ఇలా శయ్యమీదకురా!"

రత్నాలంకారాలు ముత్యాల తోరణాలు కట్టిన పట్టెమంచం దగ్గరకు తీసుకువెళ్ళి, తాను పట్టుపరుపుమీద జరుగుతూ సీతను కూచోమన్నాడు రాముడు.

"ఇది మా నాన్నగారు. నేను పట్టాభిషిక్తుడ్ని కాబోతున్నాననే సంతోషంలో నా మెడలో వేసిన వచ్చలహారం. వనవాస జీవితం ముగియగానే తిరిగి మెడలో వేసుకున్నాను."

పరధ్యానంగా వున్న సీత గభాలున రాముడు చెయ్యిపట్టుకు లాగేసరికి సరిగా అతగాని వక్షస్థలంమీద వాలిపోయింది. అవకాశాన్ని రాముడు విడిచిపెట్టక ఆమెను హృదయానికి అదుముకొని 'సీతా' అన్నాడు ప్రేమావేశాలు పెనగొనగా.

సీత కంగారుగా అంత వెలుగులో ఎవరైనా చూశారేమోనని అటూ యిటూ చూసింది. ఒక పార్శ్వాన తగిలించబడ్డ అద్దంలో సీతారాముల ప్రతిరూపం పలుకరించింది. సీత సిగ్గుతో మొగ్గలా ముడుచుకొని రాముని చేతుల్లోనుంచి తప్పించుకొని బయటపడి రివ్వున అద్దం దగ్గరకు వెళ్లింది. అద్దం మీదకు పట్టుతెర లాగి ఉడుకుపడ్డ మనసుతో తిరిగివచ్చి కూచున్నది.

"శయన మందిరాల్లో ఈ అద్దాలు ఎందుకనో నాకు నచ్చవు." అంది సీత పెదవులు ముడిచి.

రాముడు పకపకా నవ్వాడు. సీత పట్టి తప్ప అంతగా ఎక్కడా నవ్వనివాడు. ముత్యాలు రాలాయేమో అనిపించి కాసేపు పరవశించిన సీత అంతలో లేనికోపం తెచ్చుకుంది. "అలా నవ్వుతారేం?"

"అద్దంలోనివి మన ప్రతిబింబాలే కదా! స్త్రీలెంత సంకుచిత హృదయులో అని నవ్వొచ్చింది సీతా!"

"అంటే నన్నే అనండి మొత్తం స్త్రీలందర్నీ అంటారెందుకని? అందులో మీకు పూజ్యులైన అమ్మగారు కూడా కలిసిపోతారు సుమా!"

"మా అమ్మ, సుమిత్రపిన్ని, కైక పిన్ని ఏమైనా తక్కువ వారా సీతా? వారిని వారు అస్తమానమూ కించబరుచు కుంటారు. ముందు యుగాల్లో స్త్రీలు అసలు తాము కించబరచుకోకుండా బ్రతకాలని నా ఆకాంక్ష."

"అత్తగారి కిప్పుడొచ్చిన తక్కువేముంది? ఆమె తనని తాను తక్కువ చేసుకునే పరిస్థితి అసలెప్పుడొచ్చింది-స్వామి?"

"నీకు తెలీదు సీతా! ఉదయం లేచి లె



గావే పాలు ఫలాలు తీసుకోవడానికి ముందు గానే ముగ్గురమ్మలనూ చూడబోతాను కదా! తల్లులందరూ నా దగ్గర విడివిడిగా తమ ఆవేదన వెళ్లబోసుకున్నవారే. "సూర్యోదయ మవుతూనే, పక్కనుంచి లేస్తూనే — 'ఈ సౌభాగ్యహీనమైన మొగాలు' ఎందుకు చూస్తావు తండ్రీ. చందమామ లాటి సీత మోము చూసే వస్తున్నావు కదా!—" అంటూ తరచుగా ప్రశ్నిస్తారు. విధవకావడం విధిలిఖితం. విధినిర్ణయానికి ఎవరు బాధ్యులు? వాత్సల్యం ప్రేమ అనే ఆత్మీయ బంధాలకంటె వేరే శుభశకునా లేమున్నాయి? శుభశకునాలు చూచుకొని లేస్తే విధిరాసిన గీత చెరుగు తుందా? — ఈ మూఢ నమ్మకాలు నశించాలి సీతా! ఇవి ముందరగా అంతరించాలి —" నిట్టూర్చాడు రామరాజు.

"మీరు మరీ ఉపద్రవంగా మాట్లాడు తున్నారు. స్త్రీలకిప్పుడు వచ్చిన పెద్ద లోటేముంది?—"

"స్త్రీలకు జరుగుతున్న అన్యాయాలు అన్యాయాలుగా కనపడక పోవడమే గొప్ప దురన్యాయం. తాటకిని చంపవలసి వచ్చిన నాడెంత బాధపడ్డానో, అహల్యను చూసి ఎంతగా కరిగిపోయానో నీకర్థంకాదు సీతా! మండోదరి మహా సాధ్వి. ఆమెకీ అన్యాయమే జరిగింది విధిప్రేరణవల్ల! ఏ కారణంగానైనా స్త్రీలకు అన్యాయం జరగకూడదనే ధర్మాన్ని ప్రజల్లో ఎలా వ్యాపింప జేయాలా అని నిరంతరం ఆలోచిస్తున్నాను."

ద్వారంవద్ద అలికిడికి ఇద్దరూ తలఎత్తి చూశారు. సీత రామునికి కాస్త దూరంగా జరిగి నిలబడి "ఎవరక్కడ? రావొచ్చు!" అంది.

పరిచారిక వచ్చి పూలమాలలున్న బంగారు పళ్లెం వెండి పీఠంమీద వుంచి వెళ్లింది. దాస దాసీజనం నిర్భయంగా వచ్చినా, సంతోషంగా వచ్చినా సీత మందిరంలోకే. వాళ్లకు పవిత్ర పూజామందిరమది.

ఒక పూలమాల నాగరం మీదుగా జడలో ముడుచుకొంది సీత. పళ్లెంలో ఒక పెద్ద మాల సీతను ఆకర్షించింది.

"ఎవరు కట్టిన మాలో? ఎంత సొగసుగా వుందో చూడండి" అన్నది మురిసిపోతూ.

"ఏదీ?—" అని అందుకున్న రాముడు త్రుళ్లిపడి ఆపళాన హారాన్ని సీత మెడలో పడవేశాడు.

సీత సిగ్గుల పెళ్లికూతురై ఓరగా చూస్తూ "మరీ కొంటెతనం ఎక్కువైంది మీకు. సింహాసనం అధిష్ఠించినా నా దగ్గర చిలిపితనం పోలేదా? అయినా ఈ హారాన్ని ముట్టుకొంటూ అలా తుళ్లి పడ్డారేం?"

"సీతా! అదంతా ఇప్పుడెందుకు?— ఇంకేమైనా కబుర్లు చెప్పు." అన్నాడు ఆమె బుగ్గపై చిటికవేస్తూ.

"నాదగ్గర కూడా మీకు దాపరికాలున్నాయన్న మాట!"

"ఉండకూడదని ఏమైనా నియమమా? నేను స్త్రీకి బానిసను కాను. కాని—పురుషులకి స్త్రీలు బానిసలు కారాదంటాను, అయినా సాధారణ మనుషుల్లాగా నాచేత ప్రగల్భాలెందుకు పలికిస్తావు సీతా?—"

"మీకు నామీద నిజంగా ప్రేమవుంటే... అసలు సంగతి చెప్పారు"

"ఈ యుగంలో చెప్పదగనిది."

"సరే!— మీ యిష్టం" సీత ముఖం జేవురించడం చూసి శ్రీరామచంద్రుడు చిరునవ్వు నవ్వాడు. "సీతా! కోపంవద్దు."

చివరికి రఘురాముడు సీతాదేవి కన్నుల్లోకి చూస్తూ "ఆదండ పరస్త్రీ హస్తస్పర్శలాగ తోచింది దేవీ!" అన్నాడు.

ఉలికిపడింది. "పూలమాలేమిటి? పరస్త్రీ ఏమిటి? నాకేమీ అర్థంకాలేదు."

"చెప్పక తప్పదా?—"



"తప్పదూ—" అంది గోముగా.

"ఈ మాల అల్లిన యువతి నన్ను ప్రేమిస్తోంది సీతా!"

సీత ఒక్క క్షణం కలవరపడింది. "మీ రాజ్యంలో ఎవరు మమ్మల్ని ప్రేమించడం లేదని?—" అంది తేరుకుంటూ.

"ఆ ప్రేమ వేరు, ఈ ప్రేమ వేరు."

"అయితే ఒక పని చేస్తాను. ఆ కన్యను తెచ్చి మీకు వివాహం చేస్తాను."

"చాలా గొప్పపని చేస్తావు. నీవు త్యాగశీలి వనిపించుకోవాలి అనే ఆరాటం తప్ప, స్త్రీ లోకానికి బహుభార్యాత్వంవల్ల కలిగే కష్టనష్టాలను ఆలోచించటంలేదు."

"రా రా జు లెందరో. ఎంద రెందరో రాణుల్ని ఏలలేదా ?"

"ఇకముందు అలా జరగరాదు."

"మామగారు ..." సంకోచిస్తున్న సీతను ఆపి.

"అంతఃపురంలో విధవలుగా బొమ్మల లాగా, రాలిన పూలలా విలపిస్తున్న అమ్మలను తలచిచూడు. ఆయన సంతుకోసమో, సంతోషం కోసమో చేసిన పనికి ఫలితం వీరి దుఃఖం."

"కాని ఒకరిద్దరు భార్యలుంటే పెద్ద నష్టముండదు."

"సీతా !" రాముడి గర్జనకు తుళ్లి పడింది.

హడలిపోయిన సీతను దగ్గరకు తీసుకుంటూ "ఈ రాముడు కోరికలు తీర్చుకోడానికి పుట్టలేదు సీతా ! అంత మాత్రానికి మనసు, ప్రేమ, వలపు తెలీని మూర్ఖుడిగా అనుకోగలవా ? ఈ ప్రశ్నకి నీవే సరియైన సమాధానం చెప్పగలదానివి."

ఏవేవో తలపులతో సీత మొగం రాగ రంజిత మైంది.

బరువుగా కనురెప్పలెత్తి ధైర్యం తెచ్చుకుంటూ "మీరు ఏకపత్నీ వ్రతులుగా ఎంత గొప్పవారైనా లోకం మిమ్మల్ని నిందించక మానదు. ఎందుకనుకున్నారు ? నన్ను అగ్ని పరీక్షకు నిలబెట్టినందుకు." అన్నది.

"నేను ఆదర్శమూర్తినని పొగడుకోలేదే? —ఏ చిన్న ఆదర్శానికైనా ఎప్పుడూ అవరోధాలుంటాయి. మానవత్వాన్ని అభిలషించి అభిమానించే నన్ను రాజధర్మం ఇట్లా కట్టిపడ వేస్తోంది అడుగడుగునా .. రాజ్యంలో మహర్షులు పండితులు వున్నారు. చదువు లేని మూఢులూ వున్నారు. చదువురాని వారికి చర్యలే అర్థమౌతాయి. స్త్రీ హింస యిష్టంలేని నాకు తాటకిని చంపక తప్పింది కాదు. మానవత్వాన్ని ప్రేమించే నేను అగ్నిలో దూకే నిన్ను ఆగమనలేకపోయాను."

"అగ్నిపరీక్షకు నే ను నిలబడకపోయి వుంటే ఏంచేసేవారో ?" సీత కొంటెతనం పెదవులపై నాట్యం చేసింది.

"నా సీత ఎంత అభిమాన వంతురాలో చాటిచెప్పి సంతోషంగా స్వీకరించి వుండేవాడిని. అయినా స్త్రీలకంత సాహసం ఇంకా ఎక్కడిది సీతా ?"

"అప్పుడు మీరు మంచివారు. నేను చెడ్డదాన్ని అయివుందును." అంది సీత పెదవుల్లో చిరునవ్వును దాచుకుంటూ.

"ఆత్మాభిమానం వుండే చెడ్డవాళ్లెలా అవుతారు ?"

"అయితే నేను అభిమానవంతురాల్ని. ధీరురాల్ని అనిపించుకునే అవకాశం పోగొట్టుకున్నానంటారు. ఏమైనాసరే స్వామీ నాకు మరో అవకాశం మీరివ్వాలి."

"తథాస్తు ! మాటల్లో నన్ను కట్టిపడేస్తున్నావు ... అవతల రాచకార్యాలే లేకపోతే నీకు తగిన శిక్ష వేసివుండేవాణ్ణి.' '

"చాలు చాలు. ఆవేశాలు—" దూరంగా జరుగుతూ "మీకు సభకు వెళ్లే వేళైంది. నేను అత్తగారిని దర్శించుకుంటాను." అంది సీతామహాలక్ష్మి.

సీత ముంగురులు సవరించుతూ లేచి నిలుచున్నాడు రామచంద్రమూర్తి.

పూర్ణ చంద్రబింబాన్ని నీలమేఘం విడిచి దూరం జరిగినట్లుందా ప్రదేశం.

సీత నిట్టూర్పు వి డి చిం ది. ప్రేమ, ఆరాధన, ఆలోచన, ఆవేదన ఆ నిట్టూర్పులోంచి వెలువడి ప్రపంచ వ్యాప్తం కావడానికి బయలుదేరేయి.

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

కె. ఎస్. — చీరాల.

కథతోపాటు హామీ పత్రం పంపాలని రాశారు హామీ పత్రం ఎలా వుంటుందో వివరిస్తారా ?

ఎలావుంటుందో నమూనా తెలియదుగాని ఈ కథ నా స్వంతం, ఏ కథకూ కాపీకాదు. (నా కథకే కొత్త కాపీకాదనీ, యింకో పత్రికకు కూడ పంపితే పంపాననీ, లేకుంటే లేదనీ కూడారాయడం అవసరమేమో యిలాంటిపన్లు యీ మధ్య ఎక్కువ అయ్యాయని సంపాదకులు అనుకుంటున్నారు) అని రాస్తే చాలు.

ఎమ్. వి. ఆర్., విజయవాడ

ఎదురుపడినా ఒకప్పుడు తెలిసినవాళ్ళు పలకరించరు. గొప్ప అనుకోవాలా ? చూడలేదేమో అనుకోవలా ?

మనసెక్కడో వుంటే కళ్ళు గుడ్డివే అవుతాయి.

ఎస్. ఎస్. ఆర్. ఓబిలి

మీరు స్త్రీలకి అనుకూలంగా జవాబు లిస్తారు. మీరు స్త్రీగా పుట్టినందువల్ల. అదే పురుషునిగా పుట్టివుండి పురుషులకి అనుకూలంగా వాదించేవారేమో.

వాదించను తనసాటి మనిషిగా మాత్రమే ఆడదాన్ని గౌరవించి, ఆమె కష్ట సుఖాలు పంచుకొనే సహృదయునిగా ఉంటే ఉండేదాన్నేమో!

ఎస్. ఎస్. ఎమ్. గుంటూరు

మీ ఎదుట మిమ్మల్ని ఎవరేనా దూషిస్తే సహించకలరా కె ర గారూ.

"ఎదుట పొగిడినప్పుడు భరించలేనిది తిడితే ఎందుకు భరించను మనసా, వచ్చినట్లు విను. నాకు నేనే బుద్ధి చెప్పుకుని చిరునవ్వుతో వింటాను. (మనలో మనమాట ముఖం ఎదుట ఉన్న అభిప్రాయాన్ని ఉన్నట్లు ఎందరు చెప్పగలరు ? వెనక కావలిస్తే వెయ్యి వాగుతారు కాని !)

ఎస్. ఎన్. ఎస్. డి. — విజయనగరం.

నేటి వరకట్నాల గురించి మీ ఉద్దేశ్యం?

ఏది చట్టసమ్మతం కాదో అది అవశ్యం విసర్జనీయం.

ఎమ్. ఆర్. వి. పి. — భువనేశ్వర్.

పవిత్రత అంటే ఏమిటి?

ఏంలేదు బురదలో పుట్టినా, బ్రతికినా కమలం లాగా స్వచ్ఛంగా వుండ కల్గడం

పి. జె. ఆర్. — హైద్రాబాదు.

తల్లిగర్భం భారం అనుకుంటుందా? బాధ్యత అనుకుంటుందా?

సరదాగా మోస్తే భారం అనిపించదు బాధ్యత అని మోస్తుంది.

పి. ఎన్. ఎమ్. — కొత్తపల్లి.

మీకు ఉడుకుబోతుతనం హెచ్చేమో అనిపిస్తుంది. మీకు కారం అంటే చాలా రుచి అనుకుంటాను.

ఉడుకుమోత్తనం ఎడాల్‌సెంట్స్‌కి ఉంటుంది. నా కెందుకుంటుంది? ముప్పయి ఏళ్ళకు పైగా యీ అరవ తిండితిని కారం అంటే భయం— మరింకో థియరీ ఆలోచించండి.